# కూలోడిగ్గూడా మొగబిడ్డా?

''తెల్లారే కుందికి ఆడ ఎవ్వరికి ఆరకపోతా ఉండాదో? ఏంపాడో? 'కవిసమ్మేళనం! కవిసమ్మేళనం!!' అంటా ఈ మొగోడు ఎగిరెగిరి పడ్తావుండాడు. ఇట్టా ఎగిరెగిరిపడే మొగోళ్లంతా ఎగిరెగిరి పడాల్సిన చోటమాత్రం తడ్సిపాయ్‌న టవాసుమాదిర తుస్సుమని పోతారు.'' అని సొణుక్కుంటా ఆ పొద్దు తెల్లార్తో మా బాశాలి పడక మిందుండి లెయ్‌లేక లేసె- లెయ్‌లేని మణిసి కాకపాయ్‌నా!

ఇంట్లో మొగోడు కవి సమ్మేళనానికో కాటికో ఏటికో ఎల్బార్తా వుంటే ఆడది ఏంజెయ్యాల మాటతో గూడా లెయ్యాల. గుడ్డాగుసురు సర్దాల. దూనేదూరని తలకంత సమురుబెట్టి దువ్వి సోకు చెయ్యక పాయ్‌నా నవ్వతా సాగనంపాల. అటుమంటిది సొణగతా లేస్తావుంటే నాకు కోపం రావాల్సింది పాయ్ నవ్వొచ్చె!

''ఇద్దో! ఈ పైపై నవ్వులేగదా పాణానికి చేటు. ఇప్పుడు ఈడ ఏం కనపడ్తా ఉండాదని అర్తంపర్తంలేని ఆ నవ్వులు? చెప్పె యిందాం!'' అంటా నిలదీసె.

''ఒసే! నాచిలకలకొలికీ! వలపులగిలకా! అప్పుడెప్పుడో మనం యిద్దరు వయిసుమింద ఉణ్ణెప్పుడు పడకమిందుండి నువ్వు లెయ్‌లేక లేచింది గ్యాపకాని కొచ్చిందే!'' అని ఎట్టా చెప్పమంటారు? చెప్తే చెప్పుతోగొట్టి సెడగోపరం పెట్టించుకుణ్ణెట్టు అయితిందని ఏకంగా ఏడుపుమొకం పెటేసినా!

''ఎట్టమ్మా ఈ మొగోడ్తో? సెణం చిత్తం. సెణం మాయ. అంతలేకే నవ్వు. అంతలేకే ఏడుపు. ఈ పొద్దాడ ఆ కవి సమ్మేళనంలో ఎంతమంది మొకాన రాసిపెట్టుండాదో ఏడవాలని. దాన్ని యిప్పుడే యీణ్ణే నువ్వు మొదలుపెట్తే ఎట్నే? పోనీ! ఏం కావాల్నో ఏడిస్తే పోలా?'' అంటా ఒక దెప్పుదెప్పింది.

నాకు ఎల్లవొచ్చినట్టు వచ్చె కోపం!

''ఒళ్లు కడుక్కుండేదానికి ఉడుకునీళ్లు కావాలనుకుణ్ణా! నువ్వు ముడుక్కోని ఉండేది చూసి చన్నీళ్లతో సరిపెట్టుకుణ్ణా! ఇద్దో ఈ పంచను జుబ్బాను రేత్రి మట్టసంగా మడ్సి దిండుకింద పెట్టి పొణుకుణ్ణా! నీకు చెంబిస్త్రీ చేసే శ్రమలేకుండా చేసినా. తలకు రొంత సమురుబెట్టి తలదువ్వ మందామనుకుంటే ఆడ దూనె దూరదు. సమురు నిలవదు.''

''అద్దో! ఆడికి నిలుపు నీ కవిత్తం. చెప్పాల్సిన చోటికి పొయ్ చెప్తే ఈడికందని ఆడికిచాలని శాలవయినా వొగిటి కప్పుతారు. ఈ కతలన్నీ ఆడ కట్టిపెట్టి అసలుకతకు రా!'' అంటా ఎడమచేతిని సూర్రెకాంతం తిప్పినట్టు ఏడుతిప్పులు తిప్పె.

''అసలు కతకాడి కొచ్చేదానికి వయసా వల్లకాడా?'' అంటా నిగ్గదీస్తే దాని నిగ్గేపోతింది. నా సిగ్గు చిముడుతుందని-

''ఏం కావాల్సిన పన్లేదు సామీ! చెయ్యాల్సిన పని అసలే లేదు. నువ్వట్టా యీదిలోకి పొయ్ ఎదురుంగా వస్తే చాలు!'' అన్నానో లేదో-

''ఎదురుంగా వచ్చే ఆడోళ్లను ఎగాదిగా చూడకుండా పోతే సాల్దా నీ బతుక్కు'' అన్నెట్టుగా ఒక చూపు చూసి అప్పుడు బ్రష్ చేతికెత్తుకుండె!

అదే మాయమ్మ అయితేనా?

ఉద్దోగం చేసుకుంటా ఉణ్ణెప్పుడు లీవుమింద మా ఊరికి పొయ్యేటోణ్ణి. ఉండినన్నాళ్లు ఉండేటోణ్ణి. రేపు ఎలబార పోతాననంగా ఈ పొద్దు-

''యమా! యమా! లీవయి పొయ్యిందే! రేప్పొద్దన్నే ఎలబారాల్సిందే?'' అని అంటే-

''నిన్ననంగా వొస్తివి. ఈ పొద్దిటికే లీవు అయిపొయిందంటే ఎట్రా అబ్బోడా? కులం తక్కవోళ్లకురా కూలి బతుకులంటే యినిపించు కోకుండాబోతివి. కూలిచ్చినోడు అప్పిచ్చినోడు ఊరికే ఉండమంటే ఉంటారా?'' అంటా యీష్టబోతా రేత్రంతా నిద్దర బొయ్యేదిగాదు.

కడజాములో గంపకింద కోడి 'కొక్కరోకో!' అంటేసాలు. కొంపలు అంటకపోతా ఉణ్ణెట్టు మాయమ్మ ఎగిరిపడిలేసేది. గాడిపొయ్యి మింద పెద్ద అండానిండా నీళ్లుబెట్టేది. కట్టె కంపా యేసి మంటేసేది. సలసల కాగినాక నన్ను తట్టితట్టి నిద్దరలేపేది. ఉడుకుడుగ్గా నీళ్లుపోసేది. నేను నిక్కతా నీలగతా వొళ్లు తుడ్సుకుంటా గుడ్డలు ఏసుకుంటా ఉంటే- సేతి కందితే చిటికెడు బూడిద. లేకుండాబోతే దీగూట్లో టెంకాయిచిప్పలో దమ్మిడెత్తు

ముగ్గిపిండి. ఎత్తి అంత నోట్లో యేసుకుండేది. ఇట్ల రొండుసార్లు. అట్ల రొండుసార్లు. గబగబ తిమిడేసేది. అన్ని నీళ్ల పుక్కళించి ఊసేది. దోసిడు నీళ్లతో మొకం అట్టా కడిగినట్టు కడిగేది. పైట కొంగుతో తుడ్సుకునేది. పగడ మంత పసుపు మొకమంతా రాసుకోని రూపాయి బిళ్లంత కుంకం బొట్టుపెట్టి 'పటమెగిరి పోతా ఉండాది. ఎలబార్రా అబ్బోడా!' అంటా నా తల్లే ముందుగా ఎలబారేది. నేను ఎలబారి యీదిలోకి వొచ్చేకుందికి నవ్వతా నా ఎంటపడి గెరిగిల చింతమాని దాకా వొచ్చేది- దూడను వొదిలి పెట్లేని ఆవుగొడ్డు మాదిర్తో!

''ఇంక నువ్వు నిలబడే అమ్మా'' అంటే-

''బద్రంరా! అబ్బోడా బద్రం. కాలం మారిపాయ. ఇపరీత కాలానికి యింత యింత బుద్దులు. ఊరుగాని ఊరికి పోతావుండావు. ఇంతకంతకు కుక్క సంతకుబొయ్యేన యవ్వారం తెచ్చుకోబాక.'' అంటా పైటచెంగు సాట్లో మొకాన్ని దాచుకుండేది- అప్పటికి నేను ఎక్కణ్ణో ఉండే అమెరికాకో అంతకన్నా దూరాబారానికో పోతా ఉణ్ణెట్టు!

అట్టాంటిది ఈ పొద్దు నేను ఎలబార్తా ఉండానంటే మా బాశాలి గడప దాటకుండా యివతల్నే నిలబడుకోని తొంగి తొంగి తూరుపు పరంటగా జూసి 'ఊ! ఎట్లా?' అంటా రాగం తీసింది.

''ఇట్నే!... నాళ్లగ్గాళ్లమండపం కల్లా!'' అన్నాను.

''సరే రా!'' అంటా లోపలి కొచ్చేసింది.

ఎదురుంగా వొచ్చేకుందికి నాకు ఎయ్యేనిగల బలం వొచ్చేసింది. ఇంకనన్ను పట్టేదానికి పగ్గాలుంటాయా? గడప దాట్నాను. ఇంటి ముందర్నే నిలబడుకోని అట్టా యిట్టా చూసినాను.

ఈది ఈదంతా బిసురోమని ఉండాది.

ఆ ఈదిని చూస్తా ఉంటే- 'ఈ పొద్దు రిపబ్లిక్‌డే అవునోకాదో అన్న సందేహం పటుకునేసింది. ఇంట్లోకి పొయ్ అడిగి సందేహం తీర్సుకుందామంటే ముందుకేసిన అడుగు ఎనిక్కేసే దానికి బుద్ధిపుట్లా. ఈదిలో ఎవుర్నన్నా అడగదామంటే బయిశాట్లు. 'రిపబ్లిక్‌డే అయితే ఎవుడికీ చీమ కుట్నెట్టన్నా అనిపించలేదే!... ఎందుకబ్బా?' అనుకుంటానే ఎలబార్నా.

ఈ జనానికి ఏం పొయ్యేకాలం వచ్చిందో? ఏంపాడో? తెల్లోడు యిడ్సిపెట్టేసి పొయ్‌నా ఈళ్లింకా వాడి మాయలోనే పడి తనకలాడ్తా ఉండారే? ఏమయినా నాయాండ్లు వాళ్ల శానా గెట్టోళ్లు. జుట్టు బొట్టు కట్టూ అన్నీ మార్సిపారేసిరి 'మమ్మల్ని యిడ్సి పెటేసినా మాబాస జోలికి రాకుండా మీ బాశాండ్లతో మాట్లాడంగ్రా చూద్దాం!' అని ఈ పొద్దుటికీ మిడ్సిపడ్తానే ఉండారు. అది ఎట్లన్నా పోనీ! నిన్నగాక మొన్న. జనవరి వొగిటో తేదినాడు. శంకురాంతికి సాయిబ్‌కు సంబందం ఉణ్ణెట్టుగా తెల్లవాదులు మేలుకోని తెలుగు కొంపల

ముందర యింగిలిపీసు అచ్చిరాల్తో ముగ్గులు పోస్తారే ఈ ముదనష్టపు ఆడవి. పోటాపోటీలు పడ్తా గుళ్లకు గోపరాలకు పోతారే? మనకూ సమ్మత్సరానికి ఒక దినం ఉండాదని మర్సిపాయ్న ఈ జనాన్ని ఏం జేస్తే తీర్తింది?

పోనీ! ఈ పొద్దు ఎటువంటి దినం? ఎన్ని పుంగునూర్లయితే ఒక బెంగుళూరు అయ్యేదన్నెట్టుగా మన పండగలు ఎన్నయితే ఈ ఒక్క పండగతో సరిసమాన మయ్యేది? ఇదేమన్నా యినాయకుడి పండగా? గిచ్చి గిచ్చి జగడాలకు పిల్సి కొట్టుకోని చచ్చేదానికి! లేకుండాబోతే సంకురాంతి పండగా? కోళ్లకు కత్తులుగట్టి తమాసజూసే దానికి! ఎందురో మహన్నబావులు. పడరాని పాట్లు పడ్రి. నెత్తురుచుక్క నేలరాల్తే ఎట్టబ్బా అనుకుంటానే రాలస్తానే పోరకలాడ్రి. ఇల్లూ వొళ్లూ గుల్ల జేసుకుండ్రి. 'ఎల్ల కాలం వొకడి కింద వొంగి వంకాయిలు కోసేదెందుకురా? నిలబడి టెంకాయిలు కొయ్యండిరా.' అంటా ఈ యింటిని యిట్టా నిలబెట్రి. అంటే యిదేమన్నా సన్నపనా?

అయినా ఈ యదవ నాయాలి గుంపుకు యిది పండగ్గానే తోచలా. లేకుండా బోతే ఈ యీాది యిట్టా పాడుగొట్టుకుంటా ఉంటిందా? అదే డిల్లీ పట్నంలో అయితేనా? చూసేదానికి కండ్లే సాలవే? –

నాలుగు బార్లట్టా నడ్సేకుందికి నలబైయారు యిదాలుగా ఆలోచన్లు పోతావుంటే నాలుగ్గాళ్లమండపం కాడికి పాయ్నా.

చిన్న చిన్న పిలకాయిలు. చిట్టి పొట్టి పిలకాయిలు. అందురు బుడంకాయంత బుల్లోళ్లు. కొందురు ఎర్ర నిక్కర్లమింద తెల్ల సొక్కాయిలు. కొందురు పచ్చ నిక్కర్లమింద తెల్ల సొక్కాయిలు. ఇంక కొందురు బుళుగు నిక్కర్లమింద తెల్ల సొక్కాయిలు– రక రకాలుగా తొడుక్కోనుండారు. మూడు రంగుల జండాను ముచ్చటగా జేబీలకు తగిలించు కున్నారు. కొందురు బస్సుల్లో కూసోని... కొందురు సైకిళ్లమింద... కొందురు స్కూటర్లెక్కి ఎవురో ఎంటబడి తరమతా ఉన్నెట్టు యిట్ట కొందురు అట్ట కొందురు ఉరకతా ఉండారు.

వాళ్ల జేబీలకు తగిలించుకోనుండే జండాల్ను చూస్తావుంటే నామణుసు యాబైయేండ్లఎనిక్కి పరిగెత్తె! అప్పుడు నేనుగూడా యిట్టా మాదిరపిలగాణ్ణే! అప్పుడుగాన యిట్టా మాదిర జండా తగిలించుకోనుంటేనా? నాయాండ్లు తెల్లోళ్లు నా నక్కుళ్లు యాడికాడ యించేసుండ్రా? సొతంత్రం అంటే యిదేగదా? ఈ పిలకాయిలందురు పెట్టి పుట్నోళ్లు. అదుర్ష్టమంతులు!...

ఇట్టా మాదిరి అనుకుంటా ఉంటే ఈ పిల్ల నాయాండ్లంతా మమ్మీ డాడీ పిలకాయిలు గదా? అని మణుసులో మెదిలె.

నా తలకాయి వాలిపాయ. ఎంతసేపు? రొంతసేపే! మా బాశాలి అన్నెట్టు సెణంచిత్తం. సెణం మాయ బతుకులుగదా మనవి. అంతలోకే తల పైకెత్తి చూసినా. చుట్టురా జనం. నా చిన్నతనంలో ఆడ చేర్తావుండ్రే జనం. అట్టామాదిరి జనం. అయితే వొగిటికి నాలుగింతలుగా పెరిగిన జనం.

అందుర్నీ ఒక్కసారి కల్జూసినా!

''ఒరే అబ్బోడా! యియ్యారవదాకా వగస్తా ఉంటివే? అదేందో పండగ జేసుకోలేదని. ఈదులన్నీ ఈ పొద్దుగూడా బిసురోమని ఉండాయని.. ఏంజూసి చేసుకోమంటావ్ రా? నీకేం? రొండు నేర్సిన మాట్లుండాయ్. మట్లాడ్తావ్. నీళ్లో నిప్పులో తాగతావుండావ్. అట్టాయిట్టాపడి చెంబిస్త్రీ దాకన్నా వొచ్చినావు. ఈ బతుకుల్ను చిన్నప్పటి నుంచి చూస్తానే ఉండావ్ గదా? చేతల్లో ఈ కరిణె మారిందా? మట్టపలకలు మార్నాయా? ఇడగ బోసిన సున్నంనీళ్లు పోసుకుండే ఈ డబ్బాలేమన్నా మార్నాయా? పోనీ! వొంటిమింద అంత చియ్యబెట్టిందా? చేసుకోని బతికేదానికి కయ్యాగాలవ లేకపోతే పొయ్యింది. ఉణ్ణిందన్నా నిలబడిందా? కూల్జేస్తే కుండగాలు. లేకుండాబోతే కడుపుగాలు. ఈ బతుకులిట్టా యాడస్తా ఉంటే పండగ జేసుకోలేదని యాడస్తా ఉండావే? ఏం జూసి చేసుకోమంటావురా? ఏం వొరగబడి పొయ్యిందని చేసుకోమంటావురా? పండగ చేసుకోవాలంట పండగ! పోనీ! అయిన కాడికి సంబడం అనుకుందామంటే– 'ఓయబ్బా! కూలోడిగ్గూడా మొగబిడ్డా!' అంటారు.'' అని పదిమందీ యిర్వై యిదాలుగా నిల్దీసి అడిగినట్టుగా ఉంటే బొదుల్జెప్పే దయిర్నం లేకుండా ఎలబార్తా ఉండా. అంత లేకే ఎవురో ఎనకన యికిలిస్తా ఉణ్ణెట్టు అనిపించె. తిరిగి చూస్తి.

ఎదురుంగా చూస్తే ముత్తారెడ్డన్న!

''ఒరే అబ్బోడా! ఈ ఎర్రిజనం పండగ చేసుకుంటే ఎంత? చేసుకోకపోతే ఎంత? ఉండేవాళ్లు చేసుకుంటా ఉండారు గదా? వాళ్లకు కవిత్తం యినిపించాలని పోతా ఉండావ్ గదా? పోపో! తొరతొరగా పో. ఈళ్లతో నీకేంపని? ఈళ్లను చూసుకుంటా గుక్కిళ్లు మింగతా నిలబడుకుంటే చలికాలానికి వొక శాలవ పోగొట్టుకోని యిశార పడ్తావ్!''

కారి మొకాన ఉయ్యలేదు కాని ఊసినట్టాయ! నా తల్లిసాచ్చిగా సెప్తాఉండా. ఎవురేమనుకుంటే నా కేమనుకుణ్ణా. ఒక్క శాలవకోసరం కక్కుర్తి పణ్ణెట్టు ఆ పండగపూట కల్లబొల్లి మాటల్నే కవిత్తం పేర్తో కక్కేసినా! ●